# 9. పులీ - మేకా - మనిషీ

కపూర్తలా యువరాజా పరంజిత్ సింహజీహరు గొప్ప భోగ పురుషులు. మహారాజా జగత్‌జిత్ సింహాజీ వారు సంస్థాన వ్యవహారాలు చూస్తూంటే యువరాజా వారు తీరికగా ఏడాదికి పదకొండున్నర మాసాల పాటు విదేశాలవెంట తిరుగుతూ నైట్ క్లబ్‌లలో కాలక్షేపం చేస్తూ ఉండేవారు.

శ్రీవారికి పుత్ర సంతానం లేదు.

వరుసగా ముగ్గురూ ఆడపిల్లల్నే కన్న యువరాణిపై వారికిగల మక్కువ ఎనాడో ఎగిరిపోయింది

ప్రస్తుతం వారు స్టెల్లా మడ్జ్ అనే ఆంగ్ల సుందరి పాదాల చెంత సర్వస్వం ధారపోస్తూ ఉన్నారు. ఆ ఆంగ్ల సుందరిని తప్ప మరెవరినీ కన్నెత్తి చూడటానికి కూడా ఓపిక లేనంత గాఢాతి గాఢంగా వారామెను ప్రేమిస్తూఉన్నారు.

శ్రీవారు సుఖంగానే ఉన్నారు. కానీ, మహారాజా జగత్‌జిత్ సింహజీ వారికి మాత్రం ఇదో జీవన్మరణ సమస్యగా పరిణమించింది.

రాజ్యార్హుడైన మనుమడా కలగలేదు. యువరాజావారేమో ఆ ఆంగ్ల సుందరిని తప్ప మరే అంతః పురాంగననూ కన్నెత్తి చూడటంలేదు.

బ్రిటిష్ వారి రూల్సు ప్రకారం భారతీయ ప్రభువులకు విదేశీ వనితలవల్ల కలిగిన సంతానం రాజ్యార్హులుకారు.

పైగా బ్రిటిష్‌వారు ఎక్కడే సందు చూసుకుని, ఏవంక పెట్టి స్వదేశీ సంస్థానాలను స్వాహాచేద్దామా అని కాచుక్కూర్చున్నారు.

కనుక, మరోక్షణంకూడా ఆలస్యం చేయకుండా యువరాజా వారికో పుత్రుణ్ణి ప్రసారించగల స్వజాతీయురాలైన కన్యను వెదికి వివాహం జరిపించాలని మహారాజా వారూ, మహామంత్రులూ నిశ్చయించి అందుకో కమిటీని నియమించేరు.

ఆ కమిటీలోని మంత్రులూ, డాక్టర్లూ వారూ వీరూ అంతా కలసి ఆలోచించి, ఆలోచించి చివరికో ప్రకటన తయారు చేయించి సంస్థానమంతటా దండోరా వేయించారు.

దాని సారాంశమేమంటే!

యువరాజా వారు తిరిగి వివాహమాడ నిశ్చయించారు. ఈ-వివాహం ద్వారా కలిగే బిడ్డ కపూర్తలా సంస్థానాధీశుడూ, ఆ బిడ్డ తల్లి రాజమాతా కానున్నారు.

కనుక......

పది తరాలుగా మచ్చలేని వంశ చరిత్ర కలవారూ, గౌరవ కుటుంబాలకు చెందినవారూ. అంగాంగ సౌందర్యంతో అలరారే వారూ, స్వయంగా సోదరులను కలిగి ఉండి తత్కారణంగా పురుష సంతానాన్నిచ్చే యోగ్యత నధికంగా కలిగి ఉన్నవారూ, స్వచ్ఛమైన ఆరోగ్యం కలిగిఉన్న వారూ నైన పదిహేడేళ్ళు దాటని కన్యలందరూ ఈ కమిటీ వారి ముందు హాజరై పరీక్షకు నిలబడి యువరాణీ కాగల అవకాశాన్ని పొందవచ్చునని పల్లె పల్లెనా దండోరా వేయించేరు.

దీనికితోడు రాజోద్యోగులకూ, తహశీల్ దార్లకూ తమ ప్రాంతాలలోగల గౌరవ కుటుంబీకుల కన్యలు ఈ పరీక్షతో పాల్గొనేలా ప్రోత్స

హించమని తాఖీదులు వెళ్ళేయి.

కమిటీవారా అన్వేషణా కార్యక్రమాన్ని ప్రారంభించే నాటికి అక్షరాలా రెండువందల ఏభై మంది సుక్షత్రియ కన్యలు పరీక్షకు సిద్ధమయ్యేరు.

యువరాణీ కానున్న యువతి కులీను రాలేనా? యువరాజా వారికి సుపుత్రుణ్ణి ప్రసాదించగల్గ ఆరోగ్య, వంశ లక్షణాలన్నీ గలదేనా? అనేది తేల్చటమే ఈ పరీక్షల సారాంశం.

హైకోర్టు ప్రధాన న్యాయమూర్తి అధ్యక్షతన అనువజ్ఞులైన డాక్టర్లూ వగైరాల్తో ఏర్పడిన ఈకమిటీ వారా కన్యలనందరినీ అక్షరాలా స్థన శల్య పరీక్ష చేసి చివరికో నలుగురు సౌందర్య రాసులను ఎన్నిక చేశారు. చేసి మహారాజా వారిముందు నిలబెట్టేరు.

యువరాజా వారికసలు ఈ ద్వితీయ వివాహమే ఇష్టంలేదు అయినా తల్లి బలవంతంమీద అంగీకరించేరు.

మహారాజా వారా నలుగురిలోనూ ఒకరిని ఎన్నికచేసి అంతఃపురంలో చేర్పించి వివాహయత్నాలకు ఆనతి నిచ్చేరు.

వివాహానికి బ్రహ్మాండమయిన ఏర్పాట్లు చేయబడినై. ఖజానా నుండి ముప్ఫై లక్షల రూపాయలు వివాహ మహోత్సవ ఖర్చులకై విడుదల చేయబడినై.

వైస్రాయికీ, గవర్నర్లకూ, రాజులకూ, మహారాజులకూ, విదేశీ స్వదేశీ మిత్రులకూ రాజోచిత లాంఛనాలతో ఆహ్వాన పత్రాలు వెళ్ళాయి.

కపూర్తలా అంతా దేవేంద్ర నగరిలా అలంకరింపబడింది. రానున్న మహామహులకై అపూర్వమైన స్వాగత సన్నాహాలూ, విడుదులూ ఏర్పాటయినాయ్.

కాని... కాని...,

ఆదేక్షణంలో అంతపురంలో కల్లోలం చెలరేగింది. సంగతంతా గ్రహించిన మిస్‌స్టెల్లామడ్జ్ ఆగ్రహావేశురాలై ఈ వివాహం గనుక జరిగే పక్షంలో తాను ఇంగ్లండ్ వెళ్ళి పోగలనని బెదరించటమేగాక తక్షణం తట్టా బుట్టా సర్దుకో నారంభించింది.

దానితో యువరాజా వారామె పాదాలచెంత కుప్పలా కూలి మూర్ఛపోయేరు.

క్షణాలమీద రాజవైద్యులు వచ్చి సకలోపచారాలూ— చేశారుగానీ, యువరాజావారికి మాత్రం తెలివిరాలేదు. అప్పుడుగానీ ఆ ఆంగ్లసుందరి ప్రభావం యువరాజావారి మీద ఎంతగా ఉందో అర్థంగాలేదు వారెవరికీ.

ఈ వివాహాన్ని రద్దుచేయటం, ఆ విషయాన్ని మిస్‌స్టెల్లామడ్జ్ స్వయంగా యువరాజావారి చెవిలో గట్టిగా చెప్పటం తప్ప మరో మార్గ మేదీ యువరాజావారిని మూర్ఛనుంచి మేల్కొల్పగలది లేదని రాజ వైద్యులు ఏక కంఠంతో సెలవిచ్చేరు.

కాని, అప్పటికే వివాహ యత్నాలన్నీ జరిగిపోయాయ్. ఆహ్వానా లన్నీ వెళ్ళిపోయాయ్. ఈ స్థితిలో రద్దు చేయటమంటే సంస్థానం పరువును గంగలో కలపటమే.

అందువల్ల మంత్రివర్గం అత్యవసర సమావేశం జరిపి, అందరూ కలసి ఆ ఆంగ్లసుందరిని ఈ వివాహానికి ఆమోదించమనీ, యువరాజా వారిని బ్రతికించమనీ, సంస్థానం పరువు నిలబెట్టమనీ బ్రతిమాలుకున్నారు:

చివరకావిడ పదిలక్షల రూపాయలు పరిహారంగా పుచ్చుకుని, నెల కొక్కసారి మాత్రం, అదికూడా ఒక్క గంటసేపు మాత్రం యువరాజా వారు నవ వధువుతో గడిపే షరతుమీద ఈ వివాహాని కంగీకరించింది.

ఆవిడ స్వయంగా తాను వెళ్ళి పోవటం లేదని పదే పదే యువ రాజా వారి చెవిలో చెప్పగా, చెప్పగా నెమ్మది మీద స్పృహలోకి వచ్చారు యువరాజా పరంజిత్ సింహజీవారు

రెండు వారాలపాటు వివాహ మహోత్సవాలు ఘనంగా జరిగి పోయాయి. వేలాది పెద్దలు హాజరై, యువరాజుకు పుత్రసంతానం కలగా లని దీవించేశారు.

నెలలు గడచిపోయినా, నెలకోసారి నవవధువును దర్శించేందుకు ఆ ఆంగ్లసుందరి అనుమతి ఉన్నా యువరాజావారు మాత్రం ఆ ఛాయలకే పోలేదు. వారంత గాఢంగా మిస్‌స్టెల్లా మడ్జ్‌ను హృదయంలో నిలుపుకుని ఉన్నారు.

చివరికి పెద్దలంతా బలవంతం చేయగా, చేయగా ఓ సుదినాన నవ వధువు జన్మను సార్థకం చేసేందుకు యువరాజావా రంగీకరించేరు.

ఆ సుదినాన నవవధువు అప్సరసలా అలంకరింప బడింది. ఆమె లావణ్యాన్ని చూసి అంతపుర కాంతలే ఆచ్చెరు వొందేరు. భవనాన్నంతా ఇంద్రలోకంలా అలంకరించి యువరాజావారి ఆగమనానికై అందరూ ఎదురుచూసేరు.

యువరాజావారు అడావిడిగా విచ్చేసి, అక్షరాలా యాభై ఐదు నిమిషాలపాటు నవవధువుతో ఏకాంతంగా గడిపి. తిరిగి ఆ ఆంగ్లసుందరి భవనాని కేగి ఆమె కౌగిట్లో వాలిపోయేరు.

ఆ మరునాడే యువరాజావారు స్టెల్లామడ్జ్ సమేతంగా నైట్‌క్లబ్ లనూ, నాటక శాలలనూ ఉద్ధరించేందుకుగానూ యూరప్‌కు పయనమై పోయేరు.

నెలలు గడచిపోయేక, యువరాజావారు విదేశాల్లో ఉండగానే నవ వధువు ఆశించిన ప్రకారం వంశోద్ధారకుడిని ప్రసాదించింది. ఆరోజు సంస్థానమంతటా ఘనంగా వేడుకలు జరుపబడినాయి. భావి సంస్థానాధీశుని గౌరవార్థం 101 తుపాకులు పేల్చబడినాయి.

కాని...కాని...

జన్మలో ఒకే ఒక్కసారి భర్తకు సన్నిహితంగా ఉండగలిగిన ఆ నవవధువు, 21 సంవత్సరాలైనా నిండని యువరాణి, రాజమాత మాత్రం మనోవేదనతో హృద్రోగం పాలై వివాహం జరిగి రెండేళ్లయినా దాటక ముందే మరణించింది.

★